# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 02-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ కేంద్ర బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై పార్లమెంట్‌లో ఈరోజు చర్చ చేపట్టారు.
- ❖ దేశంలోని అన్ని గ్రామీణ గృహాలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి సి.ఆర్. పాటిల్ తెలిపారు.
- ❖ ఈశాన్య రాష్ట్రాలకు కేంద్ర బడ్జెట్‌లో 11 వేల 486 కోట్ల రూపాయలు కేటాయించినట్టు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.
- ❖ దేశవ్యాప్తంగా కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో 7 లక్షలకు పైగా బాలికలు చదువుతున్నారని విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఉభయ సభల సంయుక్త సమావేశం ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగానికి ఈరోజు దన్యవాద తీర్మానం చేపట్టారు. అందులో భాగంగా వివిధ పార్టీలకు చెందిన సభ్యులు ఉభయ సభల్లోనూ మాట్లాడారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చకు లోకసభలో 18 గంటలు, రాజ్యసభలో 16 గంటలు సమయం కేటాయించామని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు వెల్లడించారు. ఈ చర్చ సందర్భంగా లోక్ సభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను కిరెణ్ రిజిజు ఖండించారు. రాహుల్ గాంధీ సభా నియమాలను ఉల్లంఘించారని అన్నారు. భారత సాయుధ దళాలకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని కేంద్రమంత్రి పేర్కొంటూ…

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

దేశంలోని అన్ని గ్రామీణ గృహాలకు సురక్షిత తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ తెలిపారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ... జల్ జీవన్ మిషన్ కింద.. 16 కోట్లకు పైగా కుటుంబాలకు తమ ఇంటి వద్దకే పరిశుభ్రమైన, సురక్షితమైన తాగునీరు లభిస్తోందని పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్ అపూర్వమైన పురోగతిని సాధించిందని, 80 శాతం కంటే ఎక్కువ గ్రామీణ కుటుంబాలకు ఇప్పుడు కుళాయి నీటి కనెక్షన్లు ఉన్నాయని చెప్పారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) నివేదిక ప్రకారం.. గృహాలకు కుళాయి తాగునీటిని అందించడం ద్వారా సుమారు 8.4 లక్షల కోట్ల రూపాయలు ఆదా అయ్యాయన్నారు. ఈ మిషన్ కింద 25 లక్షల మంది మహిళలకు పరీక్షా కిట్స్ ద్వారా నీటి నాణ్యతను పరీక్షించేలా శిక్షణ ఇచ్చామని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = =

బీహార్ మీదుగా నడిచే వారణాసి - సిలిగురి బుల్లెట్ రైలు ఆ రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తుందని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాల వారీ రైల్వే గ్రాంట్లకు సంబంధించిన అంశాలపై ఈరోజు ఆయన న్యూఢిల్లీలో మాట్లాడుతూ... 2026 - 27 బడ్జెట్‌లో ఈశాన్య రాష్ట్రాలకు 11 వేల 486 కోట్ల రూపాయలు కేటాయించినట్టు చెప్పారు. ఈశాన్య ప్రాంతంతో పాటు అస్సాం అంతటా ప్రస్తుతం 72 వేల 468 కోట్ల రూపాయల విలువైన రైల్వే ప్రాజెక్టులు జరుగుతున్నాయని, అనేక కొత్త ప్రాజెక్టులు, వంతెనల కోసం సర్వేలు పురోగతిలో ఉన్నాయని అశ్విని వైష్ణవ్ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా ఉన్న కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో ప్రస్తుతం 7 లక్షలకు పైగా బాలికలు చదువుతున్నారని కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. లోక్‌సభలో అనుబంధ ప్రశ్నలకు ఆయన ఈరోజు సమాధానమిస్తూ... వారిలో 2 లక్షల మందికి పైగా షెడ్యూల్డ్ కులాలు, లక్షా 77 వేల మంది షెడ్యూల్డ్ తెగలు, 2 లక్షల 64 వేల మంది ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన వారు ఉన్నారని పేర్కొన్నారు. పాఠశాలల్లో బాలికల స్థూల నమోదు నిష్పత్తి కూడా పెరిగిందని, ఇది మంచి సంకేతమని చెప్పారు. బాలికా విద్యను ప్రోత్సహించడంతో పాటు వారికి సాధికారత కల్పించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంటూ... 2026-27 కేంద్ర బడ్జెట్‌లో దేశంలోని ప్రతి జిల్లాలో బాలికల హాస్టళ్లను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిందని ధర్మేంద్ర ప్రధాన్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = =

గడచిన 5 సంవత్సరాలలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు స్థిరమైన ధరల వద్ద సగటున 4.4 శాతం వార్షిక వృద్ధి రేటును నమోదు చేశాయని, ఇది ప్రపంచ సగటు కంటే అధికమని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. భారత్ నేడు ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అనేక పంటల సాగులో ప్రముఖ పాత్ర పోషిస్తోందని న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. గత 11 సంవత్సరాలలో దేశంలో ఉద్యానవన ఉత్పత్తి 280.70 మిలియన్ టన్నుల నుండి 367.72 మిలియన్ టన్నులకు పెరిగిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశ ఆహార ధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయిలో 357 మిలియన్ టన్నులకు చేరుకుందని కేంద్రమంత్రి చెప్పారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = =

రైతులు, సాధారణ పౌరుల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం 2014 నుండి అనేక బీమా పథకాలను ప్రారంభించిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో

సభ్యులడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 8 లక్షల 35 వేలకు పైగా బీమా క్లెయిమ్స్ పరిష్కరించబడ్డాయని పేర్కొన్నారు. జీవన్ జ్యోతి బీమా కింద 6 లక్షల 30 వేలకు పైగా క్లెయిమ్స్ పరిష్కరింపబడ్డాయని, జనరల్ ఇన్సూరెన్స్‌లో దాదాపు లక్షా 67 వేల మందికి క్లెయిమ్స్ వచ్చాయని మంత్రి చెప్పారు. ఆరోగ్య బీమా కింద 99 వేలకు పైగా క్లెయిమ్‌లు పరిష్కారమయ్యాయని పంకజ్ చౌదరి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = =

ఈ-పాన్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరుతూ ఈ మెయిల్స్‌లో వస్తున్న ఓ సందేశం నకిలీదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. పాన్ కార్డ్ డౌన్‌లోడ్ సమాచారంతో కూడిన ఈమెయిల్స్ నకిలీవని మోసపూరితమైనవి కావచ్చని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ)కు చెందిన నిజ నిర్ధారణ విభాగం స్పష్టం చేసింది. ఆర్థిక అంశాలను, సున్నితమైన సమాచారాన్ని పంచుకోవాలంటూ వచ్చే ఈమెయిల్స్, లింక్స్, కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అటువంటి వాటికి స్పందించవద్దని సూచించింది.

= = = = = = = = = = = = = = = = = =

కేంద్ర బడ్జెట్.. ఆయుష్ పర్యావరణ వ్యవస్థను గణనీయంగా బలోపేతం చేయడంతో పాటు భారతదేశ సాంప్రదాయ వైద్య విధానాలకు గొప్ప ప్రోత్సాహాన్నిస్తుందని కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ అన్నారు. 2026 - 27 కేంద్ర బడ్జెట్‌ను దార్శనిక, భవిష్యత్ ఆధారితమైనదిగా అభివర్ణిస్తూ.. ప్రపంచ వ్యాప్తంగా పోటీతత్వ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను నిర్మించడానికి భారత ప్రభుత్వ నిబద్ధతను వెల్లడిస్తుందని పేర్కొన్నారు. ఆయుష్‌లో విద్య, పరిశోధన, నాణ్యత హామీ, ప్రపంచ నాయకత్వం, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి అభివృద్ధిని విస్తరించడానికి బడ్జెట్‌లో అనేక కార్యక్రమాలను ప్రకటించారని చెప్పారు. అధిక-నాణ్యత గల అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్య, అధునాతన పరిశోధన, సంరక్షణ సేవలను విస్తరించడానికి మూడు కొత్త ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (AIIA) లను స్థాపించాలనే ప్రతిపాదన బడ్జెట్‌లో చారిత్రక అంశమని ప్రతాప్‌రావ్ జాదవ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ లక్ష్య సాధనకు కేంద్ర బడ్జెట్ 2026-27 బలమైన పునాది వేస్తుందని వరల్డ్ ట్రేడ్ సెంటర్, ముంబై చైర్‌పర్సన్, ఆల్ ఇండియా అసోసియేషన్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు డాక్టర్ విజయ్ కలాంత్రి పేర్కొన్నారు. ఈ బడ్జెట్ వ్యవసాయం, పర్యాటకం, డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, అధునాతన తయారీ, గ్రీన్ ఎనర్జీపై దృష్టి సారించిందన్నారు.

= = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80 వేల 723 పాయింట్ల వద్ద నష్టంతో ప్రారంభమై... చివరికి 943 పాయింట్ల లాభంతో 81 వేల 666 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 262 పాయింట్లు లాభపడి 25 వేల 088 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 91 రూపాయల 50 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం 4 వేల 680 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీ, హర్యానా, పంజాబ్, చండీగఢ్, తూర్పు రాజస్థాన్, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లలో రానున్న రెండు రోజుల్లో దట్టమైన పొగమంచు అలముకుంటుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఉత్తరాఖండ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్, గిల్గిట్-బాల్టిస్తాన్, ముజఫరాబాద్‌లలో రేపటి వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, ఈదురుగాలులు కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది. పశ్చిమ హిమాలయ ప్రాంతంలో రేపటి వరకు అక్కడక్కడ వర్షాలు లేదా హిమపాతం కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = =